
సాక్షి
కాకినాడ
ఆదివారం । 16 । మార్చి । 2025



రూ.లక్ష విరాళం

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి తటవర్తి రవికుమార్ (హైదరాబాద్) శనివారం రూ.లక్ష విరాళం సమర్పించారు.



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం తూర్పు డెల్టాకు 3,050, మధ్య డెల్టాకు 2 వేలు, పశ్చిమ డెల్టాకు 5,200 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ ఆదివారం (సాయంత్రం)	సహర్ సోమవారం (ఉదయం)
రాజమండ్రి	6.21	4.49
కాకినాడ	6.22	4.49
అమలాపురం	6.22	4.49

నాడు ఎత్తేసి.. నేడు తొక్కేసి..

- కూరలో కరివేపాకులా మాజీ ఎమ్మెల్యే వర్మ పరిస్థితి
- నాగబాబు 'ఖర్మ' కామెంట్లపై తమ్ముళ్ల ఆగ్రహం
- వర్మనుద్దేశించే అన్నారని మండిపాటు
- ఇదంతా చంద్రబాబు వ్యూహమని ప్రచారం
- బొమ్మనకుండా పొగ పెడుతున్నారంటున్న టీడీపీలోని ఒక వర్గం
- పిఠాపురంలో 'దేశా'నికి 'చంద్ర' గ్రహణం!



సాక్షి ప్రతినిధి, కాకినాడ: ఆరు నెలలు సావాసం చేస్తే వారు, వీరవుతారంటారు. కూటమిగా జత కట్టి.. అమలు కాని హామీలతో ప్రజలను నమ్మించి.. నట్టేట ముంచుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ల విషయంలో ఈ మాట నిజమేనని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. అవసరానికి వాడుకుని, పని అయిపోయాక కూరలో కరివేపాకులా తీసి పడేసే తత్వం ఇంత కాలం చంద్రబాబుకే సొంతమనుకునే వారు. ఇప్పుడు చంద్రబాబుతో చెట్టపట్టాలేసుకు తిరుగుతున్న పవన్ కల్యాణ్, ఆయన సోదరుడు నాగబాబు కూడా ఆ తత్వాన్ని ఒంట పట్టించుకున్నట్టు కనిపిస్తోంది. పిఠాపురం శివారు చిత్రాడలో శుక్రవారం రాత్రి జరిగిన జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభలో పవన్ సోదరుడు, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు చేసిన వ్యాఖ్యలే దీనికి అద్దం పడుతున్నాయి. 'పిఠాపురంలో పవన్ కల్యాణ్ గెలుపులో ప్రధానంగా రెండు ఫ్యాక్టర్స్ పని చేశాయి. ఒకటి జనసేన ప్రెసిడెంట్ పవన్ కల్యాణ్. రెండు జనసైనికులు, పిఠాపురం ఓటర్లు' మరెవరైనా పవన్ గెలుపులో తమ పాత్ర ఉందని అనుకుంటే అది వారి ఖర్మ' అని నాగబాబు నొక్కి మరీ చెప్పారు. ఆ మాటలకు అర్థాలే వేరని ఆ సభలోనే జనసేన అభిమానులు, కార్యకర్తలు గుసగుసలాడటం వినిపించింది. నాగబాబు చేసిన వ్యాఖ్యలు పిఠాపురానికి చెందిన టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మను ఉద్దేశించినవేనని ఆయన అనుచరులు, టీడీపీ కార్యకర్తలు బల్లగుద్ది మరీ చెబుతున్నారు.

పొగిడిన నోటితోనే..

జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ 2019 సార్వత్రిక ఎన్నికల్లో గాజువాక, భీమవరంలో పోటీ చేసి, రెండుచోట్లా ఓడిపోయారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన ఒకే ఒక్క స్థానం పిఠాపురంలో గెలుపొందారు. ఈ గెలుపులో జనసేన ఎంత పని చేసిందో, స్థానిక టీడీపీ మాజీ ఎమ్మెల్యే వర్మ, ఆయన అనుచరగణం కూడా అంతే స్థాయిలో పని చేసిందనేది జగమెరిగిన సత్యం. పరాజయాల నేపథ్యంతో గత సార్వత్రిక ఎన్నికల్లో పిఠాపురాన్ని ఎంపిక చేసుకున్నప్పటి నుంచి, గెలుపొందే వరకూ వర్మను ఇంద్రుడు, చంద్రుడు అంటూ ఆకాశానికెత్తేయడంలో మెగా బ్రదర్స్ పవన్ కల్యాణ్, నాగబాబు పోటీ పడ్డారు. 'ఈ విజయం జనసైనికులది. ఈ విజయం వర్మది' అంటూ స్వయంగా పవన్ కల్యాణ్ పలు సభల్లో వర్మను ప్రశంసలతో ముంచెత్తారు. సార్వత్రిక ఎన్నికల ముందు వరకూ అన్నదమ్ములిద్దరూ వర్మను నెత్తిన పెట్టుకున్నారు. అధికారంలో భాగస్వామ్యులై, పవన్ ఉప ముఖ్యమంత్రి అయ్యాక అసలు స్వరూపం బయటపడిందని, వర్మను రాజకీయంగా పాతాళానికి తొక్కేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆయన అనుచర వర్గం మండిపడుతోంది.

విస్తృతంగా చర్చ

నేడు మెగా బ్రదర్స్ వ్యాఖ్యలు చూస్తుంటే 'ఓడ ఎక్కే వరకూ ఓడ మల్లన్న.. ఒడ్డుకు చేరాక బోడి మల్లన్న' సామెతను తలపిస్తోందని అంటున్నారు. సార్వత్రిక ఎన్నికలయ్యేంత వరకూ వర్మను వేనోళ్ల పొగడిన మెగా సోదరులు ఇంతలోనే ఇంతలా మారిపోతారని ఊహించలేదని తెలుగు తమ్ముళ్లు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలప్పుడు పిఠాపురంలో జరిగిన ఒక సభలో వర్మను ఆకాశానికెత్తేస్తూ మెగా బ్రదర్స్ పొగుడుతున్న వీడియో, శుక్రవారం రాత్రి చిత్రాడ సభలో నాగబాబు వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ఈ అంశం ఇప్పుడు కూటమి పార్టీల మధ్య హాట్‌టాపిక్‌గా మారింది. ఎక్కడ ఏ నలుగురు కలిసినా ఇదే విషయంపై చర్చించుకుంటున్నారు. పవన్ కల్యాణ్ తరచూ మార్పు రావాలంటున్నారని, చివరకు చిత్రాడ సభలో సైతం ఇదే విషయాన్ని ఊదరగొట్టారని, మార్పు అంటే ఇదేనా అని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు.

చంద్రబాబు మొండిచేయి

పొత్తు ధర్మంలో భాగంగా పిఠాపురం సీటు త్యాగం చేసిన వర్మకు చంద్రబాబు భారీ హామీయే ఎర వేశారు. కూటమి అధికారంలోకి వచ్చాక తొలి ఎమ్మెల్సీ పదవిని ఆయనకే ఇస్తామని గొప్పగా ప్రకటించారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత రెండుమూడు దఫాలు ఎమ్మెల్సీల నియామకాలు జరిగినా వర్మకు మాత్రం మొండిచేయే చూపించారు. పని అయ్యే వరకూ బుజ్జగించడం.. ఆనక గాలికొదిలేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అనే విమర్శ ఉంది. అయితే, అదే వాస్తవమని వర్మకు ఎమ్మెల్సీ పదవి విషయంలో మరోసారి రుజువైందని అంటున్నారు. అయితే, వర్మకు జెల్ల కొట్టడానికి వేరే కారణముందనే చర్చ కూడా నడుస్తోంది. గత సార్వత్రిక ఎన్నికల్లో సీటు ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ వర్మ అనుచరులు పిఠాపురంలో చంద్రబాబు, లోకేష్ దిష్టిబొమ్మలు, పార్టీ జెండాలు దహనం చేశారు. చంద్రబాబు, లోకేష్‌లను బూతులు తిట్టారు. దీనిని మనసులో పెట్టుకుని, చంద్రబాబు, లోకేష్‌లు వ్యూహాత్మకంగానే వర్మను తొక్కేస్తున్నారని, మెగా బ్రదర్స్ ద్వారా పొమ్మనకుండానే పొగ పెడుతున్నారని టీడీపీలోని ఒక వర్గం అంటోంది. లేకుంటే వర్మను నాగబాబు పదేపదే టార్గెట్ చేస్తున్నా అధినేతలు ఎందుకు మాట్లాడటం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. వాస్తవానికి మాజీ ఎమ్మెల్యే వర్మ, నాగబాబు మధ్య ఎన్నికల సమయంలో రగిలిన చిచ్చు అధికారంలోకి వచ్చాక కూడా కొనసాగుతూనే ఉంది. ఇచ్చిన మాట ప్రకారం చంద్రబాబు వర్మకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వకపోగా.. ఆయనను నిత్యం విభేదించే మెగా బ్రదర్ నాగబాబుకు ఆ పదవి ఇచ్చారు. నాగబాబును రేపోమాపో మంత్రిని కూడా చేస్తారనే ప్రచారంతో పిఠాపురంలో వర్మ అనుచరులు అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. పరిస్థితి ఇలానే కొనసాగితే నియోజకవర్గంలో టీడీపీ ఉనికే ప్రమాదంలో పడుతుందని తెలుగు తమ్ముళ్లు పేర్కొంటున్నారు.

న్యూస్‌రీల్

శృంగార వల్లభుని సన్నిధిలో రద్దీ



ఆలయం లోపల కిటకిటలాడుతున్న భక్తులు

పెద్దాపురం: మండలంలోని తొలి తిరుపతి గ్రామంలో స్వయంభువుగా వెలసిన శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం వేలాదిగా భక్తులు తరలి వచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన సుమారు 15 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. వివిధ సేవలు, కేశఖండన, అన్నదాన విరాళాలుగా స్వామి వారికి రూ.4,01,587 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్ తెలిపారు. ఐదు వేల మంది భక్తులకు ప్రసాద వితరణ, అన్నదానం ఏర్పాటు చేశారు.

అర్జీలను నూరు శాతం పరిష్కరించాలి

కాకినాడ సిటీ: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన అర్జీలను గడువు లోపు నూరు శాతం పరిష్కరించాలని జిల్లా ఇన్‌చార్జి అధికారి జి.వీరపాండ్యన్ అధికారులను ఆదేశించారు. వివిధ అంశాలపై ఆయన కలెక్టర్ షణ్మోహన్, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, జిల్లా అటవీ శాఖ అధికారి ఎ.రవీంద్రనాథ్‌రెడ్డి, ట్రైనీ కలెక్టర్ హెచ్ఎస్ భావన తదితరులతో కలిసి పలు శాఖల జిల్లా అధికారులు, పథకాల లబ్ధిదారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్‌లో శనివారం సమావేశం నిర్వహించారు. జిల్లాలో అమలవుతున్న వివిధ కార్యక్రమాల పురోగతిపై సమీక్షించారు. సమావేశంలో డీఆర్‌ఓ జె.వెంకటరావు, కాకినాడ, పెద్దాపురం ఆర్‌డీఓలు ఎస్.మల్లిబాబు, కె.శ్రీరమణి, పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ పీడీ చైత్రవర్షిణి, సీపీఓ పి.త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్ పరీక్ష

కాకినాడ సిటీ: ఏపీపీఎస్సీ ఆధ్వర్యాన ఆదివారం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్ కంప్యూటర్ బేస్డ్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు డీఆర్‌ఓ జె.వెంకటరావు తెలిపారు. స్థానిక ఎస్.అచ్యుతాపురంలోని అయాన్ డిజిటల్ జోన్ సాఫ్ట్ టెక్నాలజీస్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని ఆయన, ఆర్‌డీఓ ఎస్.మల్లిబాబు, ఇతర అధికారులు శనివారం పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏపీపీఎస్సీ, సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో డీఆర్‌ఓ మాట్లాడారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ జరిగే ఈ పరీక్షకు 464 మంది హాజరు కానున్నారని తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ విధించామన్నారు. ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించబోమని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రానికి ప్రత్యేక బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు.

స్వయం ఉపాధికి దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ సిటీ: బీసీ, ఈబీసీ సామాజిక వర్గాల వారికి స్వయం ఉపాధి పథకాల ద్వారా ఆర్థిక సాయం అందించేందుకు దరఖాస్తులు కోరుతున్నారు. బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. బీసీలకు రూ.2 లక్షల వరకూ యూనిట్లకు 50 శాతం సబ్సిడీ లేదా రూ.75 వేలు మించకుండా మిగిలినది ఆర్థిక సాయంగా అందిస్తారన్నారు. జనరిక్ మెడికల్ షాపు యూనిట్‌కు రూ.8 లక్షలు, సబ్సిడీ రూ.4 లక్షలు పోను, మిగిలిన సొమ్ము బ్యాంకు రుణంగా అందిస్తారని తెలిపారు. మేదర, కుమ్మరి, శాలివాహన వారికి బుట్టల అల్లకం, కుండల తయారీ కింద యూనిట్ కాస్ట్ రూ.3 లక్షలు, సబ్సిడీ రూ.1.50 లక్షలు అందిస్తారని వివరించారు. ఆర్యవైశ్య, రెడ్డి, క్షత్రియ, కమ్మ, బ్రాహ్మణ, ఈబీసీ వర్గాల వారికి యూనిట్‌కు రూ.2 లక్షల వరకూ ఇస్తారని, ఇందులో 50 శాతం సబ్సిడీ లేదా రూ.75 వేలు మించకుండా ఆర్థిక సహాయం అందిస్తారని పేర్కొన్నారు. కాపు సామాజిక వర్గాల వారికి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ రుణం ఇస్తారని, ఇందులో 50 శాతం సబ్సిడీ ఉంటుందని తెలిపారు. ఎంఎస్ఎంఈ పథకం కింద రూ.25 లక్షల యూనిట్‌కు రూ.10 లక్షల బ్యాంకు రుణం, రూ.10 లక్షల సబ్సిడీ ఇస్తారని, లబ్ధిదారు రూ.5 లక్షలు భరించాలని పేర్కొన్నారు. ఈ రుణాలకు 21 నుంచి 60 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. రైస్ కార్డు కలిగి ఉండాలని కమ్యూనిటీ సర్టిఫికెట్ తప్పనిసరని తెలిపారు. మహిళలకు స్వయం ఉపాధి పథకంలో ఉచితంగా టైలరింగ్ శిక్షణ ఇచ్చి, కుట్టుమెషీన్ ఉచితంగా అందిస్తారని శ్రీనివాసరావు వెల్లడించారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 22 చివరి తేదీ అని, ఆసక్తి ఉన్నవారు గ్రామ సచివాలయాలు, నెట్ సెంటర్లలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

స్వచ్ఛాంధ్రలో అందరూ భాగస్వాములు కావాలి



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న వీరపాండ్యన్, కలెక్టర్ షణ్మోహన్, జేసీ రాహుల్ మీనా తదితరులు

కాకినాడ సిటీ: ప్రతి నెలా మూడో శనివారం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని జిల్లా ఇన్‌చార్జి అధికారి జి.వీరపాండ్యన్ అన్నారు. కలెక్టరేట్ నుంచి కొండయ్యపాలెం శారదా దేవి గుడి సెంటర్ వరకూ శనివారం నిర్వహించిన సైకిల్ ర్యాలీని ఆయన, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కలెక్టర్ షణ్మోహన్ సగిలి జెండా ఊపి ప్రారంభించారు. వీరపాండ్యన్, కలెక్టర్, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, ట్రైనీ కలెక్టర్ హెచ్ఎస్ భావన తదితరులు ఉత్సాహంగా సైకిల్ తొక్కారు. ఈ సందర్భంగా వీరపాండ్యన్ మాట్లాడుతూ, పారిశుధ్య నిర్వహణ బాధ్యత మున్సిపల్, పంచాయతీ కార్మికులదే కాదని, ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. కలెక్టర్ షణ్మోహన్ సగిలి కూడా ప్రసంగించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల జరిగే అనర్థాలు, ప్రత్యామ్నాయ వస్తువుల వినియోగంపై అవగాహన కల్పిస్తూ శారదా దేవి గుడి సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన స్టాల్‌ను ఎమ్మెల్సీ పద్మశ్రీ ప్రారంభించారు. శ్యామ్ ఇనిస్టిట్యూట్ విద్యార్థులతో మానవహారం ఏర్పాటు చేసి, స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. కలెక్టరేట్ సిబ్బంది నిర్వహించిన రంగోలీ కార్యక్రమాన్ని వీరపాండ్యన్, షణ్మోహన్, డీఆర్వో వెంకటరావు పరిశీలించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి టెన్త్ పరీక్షలు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జిల్లాలో పదో తరగతి పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశామని జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) పిల్లి రమేష్ తెలిపారు. తన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పరీక్షలు సోమవారం నుంచి ఈ నెల 31వ తేదీ వరకూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ జరుగుతాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 457 పాఠశాలల నుంచి 28,963 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. వీరిలో రెగ్యులర్ 27,500 మంది ఉండగా వీరిలో బాలురు 13,765 మంది, బాలికలు 13,735 మంది ఉన్నారని తెలిపారు. మిగిలిన వారు సప్లిమెంటరీ విధానంలో రాస్తారన్నారు. ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 142 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష కేంద్రాల తనిఖీలకు వచ్చే అధికారులు సైతం తమ ఫోన్లను గది వెలుపలే విడిచిపెట్టి లోపలకు వెళ్లాలని స్పష్టం చేశారు. పేపర్ లీకేజీలకు కారణమైన వారిని ఉద్యోగం నుంచి పూర్తిగా తొలగిస్తామని డీఈఓ హెచ్చరించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ రమేష్

ఓపెన్ పరీక్షలకు 2,248 మంది

సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యాన నిర్వహించే ఓపెన్ స్కూల్ పదో తరగతి పరీక్షలు సైతం సోమవారం ప్రారంభం కానున్నాయని డీఈఓ రమేష్ తెలిపారు. ఈ పరీక్షలకు 2,248 మంది హాజరవుతున్నారని, వీరి కోసం 26 కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు.

గిరిపై భక్తజనసాగరం

- సత్యదేవుని దర్శించిన 40 వేల మంది
- రూ.40 లక్షల ఆదాయం

అన్నవరం: భక్తవరదుడైన సత్యదేవుడు వెలసిన రత్నగిరి శనివారం భక్తజనసంద్రమే అయ్యింది. రత్నగిరితో పాటు వివిధ ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి, శనివారం తెల్లవారుజామున పెద్ద సంఖ్యలో వివాహాలు జరిగాయి. ఆ నవదంపతులు తమ బంధుమిత్రులతో కలసి సత్యదేవుని దర్శనానికి తరలి వచ్చారు. వీరికి వేలాదిగా వచ్చిన ఇతర భక్తులు కూడా తోడయ్యారు. వీరందరూ సత్యదేవుని దర్శించి, పూజలు, వ్రతాలు ఆచరించారు. దీంతో, ఆలయం వద్ద రద్దీ ఏర్పడింది. స్వామివారి ఉచిత దర్శనానికి గంటన్నర, ప్రత్యేక దర్శనానికి గంట సమయం పట్టింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేసి, రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించారు. స్వామివారిని మొత్తం 40 వేల మంది దర్శించుకున్నారు. రెండు వేల వ్రతాలు నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరింది. నిత్యాన్నదాన పథకంలో సత్యదేవుని అన్న ప్రసాదాన్ని సుమారు 5 వేల మంది భక్తులు స్వీకరించారు.



సత్యదేవుని వ్రతాలాచరిస్తున్న భక్తులు

నేడు కూడా రద్దీ

సెలవు రోజు కావడంతో ఆదివారం కూడా రత్నగిరిపై భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉంది. దీనికి తోడు శనివారం రాత్రి కూడా వివాహ ముహూర్తాలున్నాయి. దీంతో, సత్యదేవుని సన్నిధిలో ఆదివారం రద్దీ ఏర్పడే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. సత్యదేవుడు, అమ్మవారిని ఆదివారం ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాకారంలో టేకు రథంపై ఊరేగించనున్నారు.


ఘనంగా ప్రాకార సేవ

సత్యదేవుని ప్రాకార సేవ ఘనంగా నిర్వహించారు. ఉదయం 10 గంటలకు సత్యదేవుడు, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకువచ్చి తిరుచ్చి వాహనం మీద వేంచేయించారు. స్వామి, అమ్మవార్లకు పూజల అనంతరం అర్చకులు కొబ్బరికాయ కొట్టి, ప్రాకార సేవను ప్రారంభించారు. ఆలయ ప్రాకారంలో మూడు సార్లు సేవ నిర్వహించి, స్వామి, అమ్మవార్లకు నీరాజనం ఇచ్చి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

తాడేపల్లిగూడేనికి మృతదేహాల తరలింపు

కాకినాడ రూరల్: స్థానిక తోట సుబ్బారావు నగర్‌లో తన ఇద్దరు పిల్లలు జోషిత్, నిఖిల్‌లను హత్య చేసి, తండ్రి వానపల్లి చంద్రకిశోర్ ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. ఈ ముగ్గురి మృతదేహాలకు కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో శనివారం పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాలను చంద్రకిశోర్ స్వస్థలం తాడేపల్లిగూడేనికి బంధువులు తరలించి, అంత్యక్రియలు నిర్వహించారు. అభం శుభం తెలియని చిన్నారులు విగతజీవులై కనిపించడంతో స్థానికులు, బంధువులు చలించిపోయారు. సాఫీగా సాగుతున్న కుటుంబం ఒక్కసారిగా తల్లకిందులవడంతో ఒంటరిగా మారిన చంద్రకిశోర్ భార్య తనూజను ఓదార్చడం కుటుంబ సభ్యులకు కష్టతరంగా మారింది. ఇదిలా ఉండగా, పిల్లలను హతమార్చి, చంద్రకిశోర్ ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలు పోలీసులకు అంతు చిక్కడం లేదు. ఈ మరణాలు మిస్టరీగా మారాయని పోలీసు అధికారులు అంటున్నారు. దీనిపై లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

వినియోగదారుల ఉద్యమం మరింత పటిష్టం కావాలి



సభలో మాట్లాడుతున్న జేసీ రాహుల్ మీనా

కాకినాడ సిటీ: వినియోగదారుడే దేశ ఆర్థిక ప్రగతికి సూత్రధారుడని, వినియోగదారుల ఉద్యమం మరింత పటిష్టం కావాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా పేర్కొన్నారు. శనివారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా జిల్లా పౌర సరఫరాలు, లీగల్ మెట్రాలజీ తదితర శాఖల అధికారులతో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి జేసీ రాహుల్ మీనా ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లాలో వినియోగ ఉద్యమం ప్రథమస్థానంలో ఉండడానికి వర్క్‌షాప్‌లు, సెమినార్ల ద్వారా తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. కేసులను సత్వరమే పరిష్కరించాలన్నారు. మెంబర్ సుశి మాట్లాడుతూ ఉద్యమానికి వారధిలా పని చేస్తామన్నారు. జిల్లా సమాఖ్య చైర్మన్ భమిడి గిరిజా రమాదేవి మాట్లాడుతూ కన్స్యూమర్ క్లబ్స్, మండల వినియోగ సమాచార కేంద్రాల్లో వినియోగ సంఘాల ద్వారా చైతన్య సదస్సులు నిర్వహిస్తామన్నారు. జిల్లా సప్లై అధికారి ఆర్ఎస్ఎస్ సీతారామరాజు మాట్లాడుతూ సభ్యులు ప్రస్తావించిన సమస్యలు పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో కమిషన్ సభ్యులు భమిడి శివమూర్తి, చాగంటి నాగేశ్వరరావు, ఫుడ్ కంట్రోల్ అధికారి శ్రీనివాసు, లీగల్ మెట్రాలజీ అధికారులు, ఆర్టీసీ డిపో, అన్నవరం సత్యదేవా మహిళా కళాశాల అధికారులు పాల్గొన్నారు. పలువురు వినియోగదారుల సంఘాల సభ్యులను సత్కరించారు.

ఎక్కువ రేటుకు ఎందుకు అమ్ముతున్నారు?

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): 'గతంలో టన్ను ఇసుక ధర రూ.475 ఉంది. ఏజెన్సీలు రూ.229కి కోట్ చేశాయి. కానీ, ఇప్పటికీ రూ.400కు పైగా అమ్ముతున్నారు. దీనికి కారణమేమిటి?' అని మైన్స్ కమిషనర్, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి, జిల్లా ప్రత్యేక అధికారి ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు. ఇసుక సరఫరా ఏజెన్సీలు సాధ్యం కాని ధర ప్రతిపాదించి, ఎక్కువ రేటుకు ఎందుకు అమ్ముతున్నాయని నిలదీశారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శనివారం జరిగిన డీఎల్ఎస్ఏ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇదే తీరు పునరావృతమైతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇకపై నిర్వహించే సమావేశానికి ఓపెన్, డీసిల్టేషన్ ఏజెన్సీలు తప్పనిసరిగా హాజరు కావాలని అన్నారు. జరిగిన తప్పులు సరిచేసుకోవాలని, ఇకపై రీచ్‌లలో ప్రభుత్వ సిబ్బందిని కూడా నియమిస్తామని ప్రవీణ్ కుమార్ తెలిపారు. వినియోగదారులతో నేరుగా సంభాషిస్తామన్నారు. మొదట వచ్చిన వారికి మొదట ఇసుక అందించేలా రవాణా వ్యవస్థ ఉండాలన్నారు. రవాణా వ్యవస్థపై పర్యవేక్షణ తప్పనిసరని ప్రవీణ్ కుమార్ స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎస్పీ డి.నరసింహ కిషోర్, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్, మైన్స్ ఈడీ డి.ఫణిభూషణ్‌రెడ్డి పాల్గొన్నారు.

కలెక్టర్లు హాజరు కాకుంటే ఎలా?

- తూర్పుగోదావరి, కోనసీమ జిల్లా అధికారులపై సభ్యుల ధ్వజం
- వలు అంశాలపై జెడ్పీ సమావేశంలో చర్చ

కాకినాడ సిటీ: జెడ్పీ సర్వసభ్య సమావేశంలో అజెండాలోని అంశాలపై జరిగే చర్చలకు తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల కలెక్టర్లు హాజరు కాకపోవడంపై ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరావులతో పాటు ఆయా జిల్లాల జెడ్పీటీసీ సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకం పనుల ద్వారా సమకూరిన మెటీరియల్ కాంపోనెంట్ నిధులను, గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌ల తీర్మానాలతో ప్రమేయం లేకుండా కలెక్టర్లు తమ ప్రాధాన్యం ప్రకారం కేటాయించడంపై సభ్యులు అభ్యంతరం తెలుపుతూ, ఈ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించాలని చైర్మన్ వేణుగోపాలరావును కోరారు.

మూడు జిల్లాల్లోని గోదావరి కాలువ చివరి ఆయకట్టు భూముల్లోని పంటలు సాగునీరు అందక ఎండిపోతున్న పరిస్థితిపై సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తూ, వంతుల వారీ విధానం, డ్రైన్ల నుంచి లిఫ్టింగ్ ద్వారా పంటలను కాపాడాలని కోరారు. కాలువల ఎగువ ప్రాంతాల్లోని రైతులకు సక్రమంగా నీటిని వదులుతున్నప్పటికీ అదనపు నీటిని అక్రమంగా తోడుతుండడం వల్ల శివారు భూములకు నీరు అందడం లేదని, ఇటువంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ హెచ్చరించారు.

తాళ్లరేవు జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్ మాట్లాడుతూ యానాం–ద్రాక్షారామ ప్రధాన రహదారిలో ఆరేళ్లుగా వంతెన శిథిల స్థితికి చేరడం వల్ల కాలువకు తూరలు వేసి పైన సీసీ రోడ్డు వేశారని, ఫలితంగా నీరు సక్రమంగా పారక పోవడం, ఆ రహదారిలో రాకపోకలు సాగిస్తున్న సుమారు 40 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఇంజరం వద్ద పూర్తి స్థాయిలో వంతెన నిర్మించి రైతులను ఆదుకోవాలని, ప్రజల రాకపోకలలో ఇబ్బందులు తొలగించాలని కలెక్టర్ కోరారు. దీనిపై కలెక్టర్ షణ్మోహన్ స్పందించి ఈ విషయం పూర్తి స్థాయిలో అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

అలాగే పౌరసరఫరాల ద్వారా పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం, హాస్టళ్లకు పంపిణీ చేస్తున్న నాసిరకమైన కొత్త బియ్యం వండినప్పుడు ముద్దవుతోందని, పిల్లలు తినడానికి ఇష్టపడడం లేదని కొందరు సభ్యులు ప్రస్తావించారు. మండలాల్లో నిర్వహించిన పనులకు చెల్లింపులు జాప్యం లేకుండా జరపాలని కోరారు.

జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమాలు జిల్లాలో విస్తృతంగా నిర్వహించాలని, ఆరోగ్యంపై వ్యయాన్ని తగ్గించేందుకు ఏర్పాటు చేసిన జనరిక్ మందుల షాపులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు కోరారు.

కారుణ్య నియామకాలను వేగవంతం చేయాలని, ఉద్యోగులకు జీపీఎఫ్ స్లిప్పులు జారీ చేయాలని ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు కోరారు.

గిరిజన ప్రాంత ప్రజల సమస్యలపై చర్చ, పరిష్కారానికి ఐటీడీఏ సర్వ సభ్య సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్‌తో పాటు, ఏఎస్ఆర్ జిల్లా పరిధి జెడ్పీటీసీ సభ్యులు కోరారు. దీనిపై ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం స్పందిస్తూ ఏప్రిల్ చివరి లేదా మే తొలివారంలో తదుపరి సమావేశాన్ని నిర్వహిస్తామని తెలిపారు. అలాగే గిరిజన ప్రాంత సమస్యలపై సభ్యులు ప్రస్తావించిన అంశాలకు ఆయన వివరణలు ఇచ్చి సమస్యలన్నింటినీ సత్వరం పరిష్కరిస్తామన్నారు.

తమ జిల్లాలకు సంబంధించి సభ్యులు లేవనెత్తిన అంశాలపై చర్యలు చేపడతామని తూర్పు గోదావరి జిల్లా జేసీ చినరాముడు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా డీఆర్వో రాజకుమారి సభ్యులకు వివరించారు.

సమావేశం విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన సభ్యులు, అధికారులకు జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణు గోపాలరావు ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో సభ్యులు ప్రస్తావించిన ప్రజాసమస్యలపై సత్వరం సమగ్ర పరిష్కారాలు అందించాలని నాలుగు జిల్లాల అధికారులను చైర్మన్ వేణుగోపాలరావు కోరారు. ఈ సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్లు బుర్రా అనుబాబు, మేరుగు పద్మలత, జెడ్పీ సీఈవో వీవీవీఎస్ లక్ష్మణరావు, డిప్యూటీ సీఈవో రామ్‌గోపాల్, ఏవో ఎం.బుజ్జిబాబు, జెడ్పీటీసీ సభ్యులు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని నాలుగు జిల్లాల అధికారులు పాల్గొన్నారు.




సభ్యుల ప్రశ్నలకు సమాధానం ఇస్తున్న కాకినాడ కలెక్టర్ షణ్మోహన్, చిత్రంలో జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు

రూ.1014 కోట్లతో బడ్జెట్‌కు ఆమోదం

రూ.70 లక్షల మిగులు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం 2025–26 ఆర్థిక సంవత్సరానికి రూ.70 లక్షల మిగులుతో రూ.1,014 కోట్ల బడ్జెట్‌ను ఆమోదించింది. ఉమ్మడి జెడ్పీ బడ్జెట్ సర్వసభ్య సమావేశం శనివారం జెడ్పీ సమావేశ మందిరంలో చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి, తూర్పుగోదావరి జిల్లా జేసీ ఎస్ చినరాముడు, రంపచోడవరం జేసీ కట్టా సింహాచలం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా డీఆర్ఓ బీఎల్ఎస్ రాజకుమారి పాల్గొన్నారు. సమావేశాన్ని జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు ప్రారంభించగా తొలుత దివంగతులైన కాట్రేనికోన ఎంపీపీ పాలెపు లక్ష్మి మృతికి సంతాపం ప్రకటిస్తూ సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం సమావేశంలో 2024–25 సంవత్సరానికి సవరించిన బడ్జెట్‌ను, 2025–26 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన అంచనా బడ్జెట్ ముసాయిదాను జెడ్పీ పరిపాలనాధికారి సభ్యులకు వివరించారు. అనంతరం బడ్జెట్‌లో పొందుపరిచిన ప్రతిపాదనలపై సమావేశం చర్చించి 2024–25 సంవత్సరానికి సవరించిన ఆదాయం రూ. 846.60 కోట్లు, సవరించిన వ్యయం రూ. 845.95 కోట్లతో రూ.65 లక్షలు మిగులుతో సవరించిన బడ్జెట్‌ను ఆమోదించారు. అదే విధంగా రానున్న 2025–26 ఆర్థిక సంవత్సరానికి అన్ని పద్దులు కలిపి మొత్తం ఆదాయం అంచనా రూ.1013.80 కోట్లు కాగా, అన్ని పద్దుల కింద అంచనా వ్యయం రూ. 1013.10 కోట్లతో, రూ.70 లక్షలు మిగులు బడ్జెట్‌ను సమావేశం ఆమోదించింది. ఆదాయంలో జెడ్పీ సాధారణ నిధులు రూ. 28 కోట్లు, ప్రభుత్వం నుంచి కేటాయించిన శాలరీ గ్రాంటులు రూ.10.48 కోట్లు, నిర్దిష్ట ప్రయోజన గ్రాంటు రూ.46.09 కోట్లు, డ్వామా, గ్రామీణ నీటి సరఫరా, ఇతర శాఖల ద్వారా వచ్చే గ్రాంటు రూ. 922.39 కోట్లుగా ఉన్నాయి. జెడ్పీ సాధారణ నిధుల నుంచి షెడ్యూల్ కులాల సంక్షేమానికి 15 శాతం కేటాయింపు రూ. 2.97 కోట్లు, షెడ్యూల్ తెగల సంక్షేమానికి 6 శాతం కేటాయింపు రూ.1.19 కోట్లు, మహిళా శిశు సంక్షేమానికి 15 శాతం కేటాయింపు, రూ.2.97 కోట్లు, అభివృద్ధి పనులకు 23 శాతంగా రూ.4.55 కోట్లు, విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, పశుసంవర్ధక, సాంఘిక సంక్షేమం తదితర సెక్టార్లకు 10 శాతంగా రూ. 2.97 కోట్లు కేటాయింపులను సర్వసభ్య సమావేశం ఆమోదించింది. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఆస్తులను పరిరక్షిస్తూ, ఆదాయ వనరులను మరింత పెంచాలని సభ్యులు కోరారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్త కొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్త కొబ్బరి (రెండో రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	17,500
గటగట (వెయ్యి)	15,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	16,000
గటగట (వెయ్యి)	14,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,500 – 14,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,500 – 14,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
కిలో	260

ఒత్తిడి లేని బోధనతో ఉత్తమ ఫలితాలు


జ్యోతి ప్రజల్వన చేస్తున్న భాష్యం హనుమంతరావు

బాలాజీచెరువు: ఒత్తిడి లేని విద్యాబోధనతో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని జేఎన్‌టీయూకే సివిల్ ప్రొఫెసర్ మురళీకృష్ణ పేర్కొన్నారు. స్థానిక భాష్యం బ్లూమ్స్ స్కూల్లో శనివారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్య ద్వారా మంచి విజయాలు సాధించడానికి అవకాశం ఉంటుందని, సరైన ప్రణాళికతో చదువుకోవాలనిసూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించారు. అంతకు ముందు విద్యా సంస్థల వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు జ్యోతి ప్రజల్వన చేశారు. కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జ్ గోవిందరాజు, ప్రిన్సిపాల్ ధృవీణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజమండ్రిలో సీన్ తీస్తే సూపర్ హిట్టే


విలేకరులతో మాట్లాడుతున్న హీరో నితిన్, చిత్రంలో హీరోయిన్ శ్రీలీల, దర్శకుడు వెంకీ కుడుముల

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): తను హీరోగా నటించిన రాబిన్ హుడ్ చిత్రంలో ప్రేక్షకులను ఆకట్టుకునే అన్ని అంశాలు ఉన్నాయని, ఈ సినిమా అందరికీ నచ్చుతుందని హీరో నితిన్ అన్నారు. గతంలో వెంకీ కుడుముల దర్శకత్వంలో తను నటించిన భీష్మ సినిమా మంచి విజయం సాధించిందని చెప్పారు. ఆ సినిమాలో ఒక సన్నివేశం రాజమండ్రిలో చిత్రీకరించామని అది హిట్టని అన్నారు. ఆ సెంటిమెంటుతో రాబిన్ హుడ్ సినిమాలో ఒక సీన్ ఇక్కడ చిత్రీకరించామని, ఇది కూడా సూపర్ హిట్ అవుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నెల 28 న విడుదల కానున్న ఈ చిత్రం ప్రమోషన్ కోసం రాజమండ్రి వచ్చిన చిత్ర బృందం శనివారం మధ్యాహ్నం మంజీరా హోటల్‌లో మీడియాతో మాట్లాడింది. నితిన్ మాట్లాడుతూ దర్శకుడు వెంకీ కుడుముల తొలి చిత్రం చలో నుంచి తనకు పరిచయం ఉందని తర్వాత తమ ఇద్దరి కాంబినేషన్‌లో వచ్చిన భీష్మ చిత్రం మంచి విజయం సాధించిందని గుర్తు చేశారు. దర్శకుడు వెంకీ కుడుముల మాట్లాడుతూ ఇప్పటికే రాబిన్ హుడ్ టీజర్, సాంగ్స్‌కు మంచి స్పందన వస్తోందని సినిమా కూడా హిట్టవుతుందన్న నమ్మకం ఉందని చెప్పారు. సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ మంచి పాటలు కంపోజ్ చేశారని చెప్పారు. శ్రీలీల ఈ చిత్రంలో మంచి పెర్ఫార్మెన్స్ ఇచ్చినట్లు వెంకీ తెలిపారు. శ్రీలీల మాట్లాడుతూ తనకు రాజమండ్రి కొత్తగాదని తమ గ్రాండ్ ఫాదర్ దగ్గరే ఉండేవారని చెప్పారు. ఈ సినిమాలో తన పాత్రను ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తారని, పిల్లలతో కలిసి సినిమా చూడాలని ఆమె కోరారు. రాజమండ్రి రోజ్ మిల్క్ తనకు చాలా ఇష్టమని ఆమె అన్నారు.